ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 18 జూలై 2025

నేడు దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ 'స్వాభిమాన్'

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం దివ్యాంగుల కోసం గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆ శాఖ ఏడీ కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల మూడో శుక్రవారం దివ్యాంగుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వినతులు స్వీకరిస్తాం. జిల్లాలో దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల'ని ఆమె సూచించారు.

దాడులు.. హత్యలు!



● ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట సమీపంలో ఈ నెల 11న ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. బైక్‌పై వెళ్తుండగా అడ్డగించి దాడి చేసి చంపేశారు. రాజకీయ నేతలకు అనుచరుడిగా వ్యవహరించే ఆ వ్యక్తి.. ఓ భార్యాభర్తల తగాదాలో పెద్ద మనిషిగా వ్యవహరించి పంచాయతీ చేయడమే ఈ హత్యకు దారితీసిందని పోలీసుల దర్యాప్తులో తేలింది.

● గత ఏడాది డిసెంబరులో పలాసలో టీడీపీ నేతను మట్టుబెట్టేందుకు బిహారీ గ్యాంగ్ రంగంలోకి దిగింది. కూటమి పాలనలో ఆ టీడీపీ నేత ఆధిపత్యం పెరుగుతుండడాన్ని ప్రత్యర్థులు సహించలేక పోయారు. రూ.10లక్షలు సుపారీ ఇచ్చి టీడీపీ నేతను హత్య చేయాలని పన్నాగం పన్నారు. కానీ పోలీసులు ముందే గ్రహించడంతో నిందితులు పట్టుబడ్డారు.

● గత ఏడాది అక్టోబరులో పోలాకి మండలంలో ఓ పార్టీ కార్యకర్తను ప్రత్యర్థులు నరికి చంపేశారు. వనవిష్ణుపురంలో గ్రామదేవత ఉత్సవాల సమయంలో రాజకీయ విభేదాలు రావడంతో రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఒక వ్యక్తి మృతిచెందగా..మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

● 2024 ఫిబ్రవరిలో ఎచ్చెర్లలో ఓ వైసీపీ నాయకుడిపై హత్యాయత్నం జరిగింది. పొలం నుంచి వస్తున్న నేతను అటకాయించి ఇద్దరు వ్యక్తులు దాడిచేశారు. ఈ ఘటనలో సదరు నేత తీవ్రంగా గాయపడగా, స్థానికులు ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలు దక్కించుకున్నాడు.

● 2023 ఏప్రిల్‌లో పలాస మండలానికి చెందిన ఓ పార్టీ నేత, సర్పంచ్ భర్తపై ప్రత్యర్థులు దాడిచేశారు. అప్పట్లో ఓ మంత్రి ప్రోద్బలంతోనే ఈ ఘటన జరిగినట్టు ఆరోపణలున్నాయి.

● 2022 డిసెంబరు 6న గార మండల ఉపాధ్యక్షుడు దారుణంగా హత్యకు గురయ్యారు. తమ రాజకీయ ఎదుగుదలకు అడ్డంకిగా నిలుస్తున్నాడని.. తమ వ్యాపారాన్ని సైతం అడ్డుకుంటున్నాడని భావించి సొంతపార్టీ నేతలే సుపారీ ఇచ్చి అప్పట్లో హత్య చేయించినట్టు పోలీస్ విచారణలో తేలింది.

- జిల్లాలో పెరుగుతున్న నేర ఘటనలు
- రౌడీషీటర్లకు కొందరు నేతల ప్రోత్సాహం
- పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపాల్సిందే



రణస్థలం, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అన్ని పట్టణాల్లోనూ రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. కొంతమంది రౌడీషీటర్లు రాజకీయాల్లో చేరి పంచాయతీలు, షటిల్‌మెంట్‌కు పాల్పడుతున్నారు. వాతపెట్టేది వారే.. వెన్నపూసేది వారే అన్నట్టు.. కొంతమంది నేతల ప్రోత్సాహంతో నేర సంస్కృతిని అడ్డం పెట్టుకొని వివాదాస్పద భూములు, స్థలాల విషయంలో బాధితులను భయపెడుతున్నారు. మధ్యవర్తులుగా వ్యవహరించి కమీషన్లు కొట్టేస్తున్నారు. ఎదురు తిరిగితే తమ రౌడీ మార్కు చూపిస్తున్నారు. ఈక్రమంలో నేరసంస్కృతి పెరిగిపోతోందని జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు.

● సమస్యాత్మక గ్రామాల్లో అధికం..

జిల్లాలో చాలా గ్రామాల్లో రాజకీయ, వర్గ విభేదాలు పతాకస్థాయిలో ఉన్నాయి. ప్రతి మండలంలో ఐదారు గ్రామాల వరకూ సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. వాటి పరిధిలో అరాచకాలు సృష్టించేవారు, అధికంగా కేసులు నమోదయ్యే వారిపై పోలీసులు రౌడీషీట్లు తెరిచారు. పోలీస్ గణాంకాల ప్రకారం జిల్లావ్యాప్తంగా 646 మందిపై రౌడీషీట్లు ఉండేవి. కానీ చాలామందిలో మార్పు రావడంతో తొలగించారు. ప్రస్తుతం 113 మందిపై రౌడీషీట్లు ఉన్నాయి. చాలా గ్రామాల్లో రాజకీయ ప్రత్యర్థులు, ఒకే పార్టీలో వర్గాలు, సామాజికవర్గాల మధ్య విభేదాలు వంటివి కొనసాగుతున్నాయి. వీటికి రాజకీయ నేతలే పెంచి పోషిస్తున్నారు. కేవలం ఒకరిద్దరు నేతల ప్రయోజనాలు, కుటుంబాల ఆధిపత్యం కోసం గ్రామాల ప్రజలు ప్రజలు అడ్డగోలుగా చీలిపోతుంటారు. ప్రత్యర్థులపై పట్టు సాధించే క్రమంలో గొడవలు, వివాదాలు, చివరకు హత్యలు చేసే దాకా పరిస్థితి వస్తోంది.

● ఉదాసీనత ఎందుకో..

అన్ని రాజకీయ పార్టీల్లోనూ పెద్ద పెద్ద నాయకుల వద్ద రౌడీషీటర్లు ఉన్నారు. అవసరానికి ఆ నేతలు వారిని వాడుకుంటూ.. రాజకీయాల్లో రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎస్పీ మహేశ్వరరెడ్డి (మిగతా 6వ పేజీలో..)

చెరో రెండు



జనసేన : జ్యోత్స్న(శ్రీకాకుళం), రామకృష్ణారావు (హిరమండలం)



టీడీపీ : విజయలక్ష్మి (కంచిలి), గౌరమ్మ (పాతపట్నం)

- ఏఎంసీ చైర్మన్, చైర్‌పర్సన్ పదవుల భర్తీ
- టీడీపీ, జనసేన పార్టీకి కేటాయింపు

శ్రీకాకుళం, జూలై 17(ఆంధ్రజ్యోతి): చాన్నాళ్ల నుంచి ఎదురు చూస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్, చైర్‌పర్సన్ పదవులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. ఈమేరకు జాబితాను గురువారం రాత్రి విడుదల చేసింది. జిల్లాలో మొత్తం నాలుగు మార్కెట్ కమిటీలకుగానూ టీడీపీ, జనసేన పార్టీల్లో చెరో ఇద్దరికి చొప్పున నామినేట్ చేసింది. నలుగురిలో ముగ్గురి మహిళలకు అవకాశం కల్పించింది.

● శ్రీకాకుళం ఏఎంసీ చైర్‌పర్సన్ పదవి 'జనసేన'కు లభించింది. శ్రీకాకుళం నగరానికి చెందిన మామిడి విష్ణు సతీమణి దారపు జ్యోత్స్నకు ఈ పదవి కేటాయించారు. ఈమె స్వస్థలం పాతపట్నం నియోజకవర్గం. డిగ్రీ కంప్యూటర్స్ చదివారు.

● కంచిలి(సోంపేటతో కలిపి) ఏఎంసీ చైర్‌పర్సన్ పదవిని కంచిలి మండలానికి చెందిన మద్దిల విజయలక్ష్మికి కేటాయించారు. ఈమె భర్త నాగేశ్వరరావు కంచిలి మండల టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. మాకన్నపురం సర్పంచ్‌గాను మూడుసార్లు ఎన్నికయ్యారు. వీరికి ఇద్దరు కుమారులు.

● పాతపట్నం ఏఎంసీ చైర్‌పర్సన్ పదవిని మెళియాపుట్టి మండలంలో టీడీపీకి చెందిన చిన్నింటి గౌరమ్మకు కేటాయించారు. టీడీపీ నుంచి ఆశించినవారికే ఈ పదవి దక్కడంతో ఆ పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● హిరమండలం ఏఎంసీ చైర్మన్ పదవిని జనసేన పార్టీకి చెందిన మామిడి రామకృష్ణారావుకు కేటాయించారు. జనసేన నేతలు, కార్యకర్తలు ఆయన అభినందనలు తెలిపారు.



నరసన్నపేటలోని జీఎన్ఆర్ షాపులో తనిఖీ చేస్తున్న బీఐఎస్ అధికారులు



సీజ్ చేసిన హాల్‌మార్క్ లేని ఆభరణాలు

బయటపడిన.. 'బంగారం' బండారం

- హాల్‌మార్క్ లేకుండానే విక్రయాలు
- అనుమతి ఒకచోట.. దుకాణం నిర్వహణ మరో దగ్గర
- నరసన్నపేటలో బీఐఎస్ అధికారుల తనిఖీలు
- 1072.45 గ్రాముల ఆభరణాలు సీజ్
- బోగస్ హాల్‌మార్క్ కేంద్రం గుర్తింపు

నరసన్నపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): 'వినియోగదారులను నమ్మించేలా.. నిజాయితీగా వ్యాపారం చేస్తున్నట్టు ప్రకటనలు.. చేసేవన్నీ అక్రమాలు. ఇదీ నరసన్నపేటలోని కొంతమంది బంగారం దుకాణాల వ్యాపారుల తీరు. గురువారం నరసన్నపేటలో ఓ బంగారం దుకాణంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారులు దాడులు చేసి.. హాల్‌మార్క్ లేని ఆభరణాలు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. సుమారు కేజీకిపైగా ఆభరణాలు సీజ్ చేశారు. అలాగే బోగస్ హాల్‌మార్క్ కేంద్రాన్ని (మిగతా 6వ పేజీలో..)



ఉద్దానంలో పర్యటించిన డాక్టర్ రవిరాజ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ

కిడ్నీవ్యాధుల మూలాలు గుర్తించండి

- ఎమ్మెల్యే గౌతు శిరీష
- నెఫ్రాలజిస్ట్ రవిరాజ్ బృందంతో కలిసి కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రం పరిశీలన

6లో

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించాలి

- పేద కుటుంబాల దత్తతను వేగవంతం చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా జిల్లావ్యాప్తంగా ప్లాస్టిక్ నిర్మూలనపై భారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 'ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించాలి. స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో మహిళలకు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల వాడకాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాల'ని ఆదేశించారు. అలాగే పేద కుటుంబాల దత్తత కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. తుది అర్హుల జాబితా ఆధారంగా మార్గదర్శులను సంప్రదించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోందన్నారు. పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలను సంప్రదించి బంగారు కుటుంబాలకు విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కంప్యూటర్ సైన్స్‌కు క్రేజ్

- నేటితో ముగియనున్న ఏపీఈఏపీసెట్ వెబ్‌ఆప్షన్ల నమోదు
- 22న సీట్ల కేటాయింపు

ఎచ్చెర్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్ పైనే విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఆకర్షణీయమైన ప్యాకేజీలు ఇస్తుండడంతో చాలామంది కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో చేరేందుకు ఇష్టపడుతున్నారు. కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ మిషన్ లెర్నింగ్ (ఏఎంసీ), డేటా సైన్స్, ఐవోటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్), సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చెందకముందు సివిల్, మెకానికల్, కెమికల్ తదితర బ్రాంచ్‌లకు విపరీతమైన డిమాండ్ ఉండేది. కొన్నేళ్లుగా ఈ బ్రాంచ్‌ల్లో సీట్లు నామమాత్రంగానే నిండుతున్నాయి.

● ఉమ్మడి జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ఇటీవల ఏపీ ఈఏపీసెట్ నిర్వహించగా 12,633 మంది విద్యార్థులు రాశారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీతో పాటు శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), (మిగతా 6వ పేజీలో..)

లోగయి.. నీరేదీ?

- షట్టర్లు విరిగి.. చుక్కనీరు నిలువక
- కరువు కోరల్లో శివారు ఆయకట్టు
- రూపుకోల్పోతున్న ఆనకట్ట
- కూటమి ప్రభుత్వం పైనే రైతుల ఆశలు

● లోగయి ఆనకట్ట వద్ద నిర్మించిన ఎడమ కాలువ మదుము షట్టర్లు ఇవి. డోర్లు మొత్తం పాడవటంతో నీరు మొత్తం ఏడాది పొడవునా ప్రవహించి అన్నదాతలకు ఆందోళన కలిగిస్తోంది. వర్షాల సమయంలో పొలాల్లో పంటలు ముంపునకు గురవుతున్నాయి. ఆనకట్ట కుడికాలువ మరమ్మతులకు నోచుకోక ఇసుక మేటలు, ముళ్ల పొదలతో నిండిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





● దశాబ్దాల కిందట రాజుల కాలంలో మందస మండలం గోవిందపురం వద్ద సునాముది గెడ్డపై నిర్మించిన లోగయి ఆనకట్ట ఇలా శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మతులకు నోచుకోక.. నీరు నిలువక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

హరిపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి)

మందస మండలంలో సునాముది గెడ్డపై రాజుల కాలంలో నిర్మించిన లోగయి ఆనకట్ట.. శిథిలావస్థకు చేరడంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మందస మండలం గోవిందపురం, కొత్తపల్లి, వీవీఆర్‌పురం, టీశాసనాం, ముకుందపురం, సోంపేట మండలం అనంతపురం, మూలూరు, గొల్లూరు వంటి సుమారు 15గ్రామాల్లో అన్నదాతలకు ఇదే ప్రధాన సాగు నీటి వనరు. దాదాపు 6,500 ఎకరాలకు లోగయి ఆనకట్ట ద్వారా పుష్కలంగా రెండు పంటలకు సాగునీరు అందేది. ఈ ఆనకట్టను సుమారు 500 మీటర్ల పొడవుతో, నాలుగు భాగాలుగా విభజించి నిర్మించారు. కాగా గత పదేళ్లుగా ఎలాంటి మరమ్మత్తులకు నోచుకోక.. ఆనకట్టలు శిథిలమై నీరు కారి చుక్క నీరు నిలువ ఉండని దుస్థితి నెలకొంది. కాలువలు వెంబడి నీరు ప్రవహించేదుకు ఏర్పాటు చేసిన షట్టర్లు సైతం తుప్పు పట్టాయి. దీంతో ఆయా కాలువల్లో నీరు ప్రవహించక.. వేలాది ఎకరాల శివారు ఆయకట్టు భూములు నీరందక ఏళ్లగా కరవు కోరల్లో చిక్కుకుంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటితీరువా చెల్లిస్తున్నా.. ఆనకట్ట మరమ్మతులకు నిధులు మంజూరు చేయడం లేదని వాపోతున్నారు.

● టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.9లక్షలు మంజూరు కాగా.. తూతూమంత్రంగా పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విదల్చలేదు. దీంతో కాలువలు అధ్వానంగా తయారై.. సిమెంటు కట్టడాలు విరిగి చుక్క నీరు నిలవటం గగనమైంది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి లోగయి (మిగతా 6వ పేజీలో..)

శివారుకు జలయోగం

- చురుగ్గా ఎత్తిపోతల పథకం పనులు
- ఈ ఖరీఫ్‌లోనే సాగునీరు అందించేలా చర్యలు

నారాయణపురం కుడి కాలువకు నీటి విడుదల

- ప్రతి ఎకరాకూ నీరందిస్తాం
- ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు

కాంట్రాక్టర్లు రాక.. వేలం ఖరారు కాక

- మండల పరిషత్ సిబ్బంది ఆశీలు వసూలు
- ఇదీ నారాయణవలస పశువుల సంతలో పరిస్థితి

6లో

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

- ఆమదాలవలస, కోష్టలో రికార్డుల పరిశీలన

బియ్యం తరుగు వస్తే ఉపేక్షించేది లేదు

ఆర్డీవో కె.సాయిప్రత్యూష

7లో

శివారుకు జలయోగం

● చురుగ్గా ఎత్తిపోతల పథకం పనులు ● ఈ ఖరీఫ్‌లోనే నీరందించేందుకు చర్యలు



వంశదార నది వద్ద బావి నుంచి ఫుట్‌పాత్ పనులు

గార, జూలై 17(ఆంధ్రజ్యోతి):

గార మండలంలోని రైతుల కలలు త్వరలో నెరవేరబోతున్నాయి. బైరిదేశిగెడ్డ శివారు భూములకు సాగునీరు అందించాల్సిన ఎత్తిపోతల పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. శివారు భూములకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో 2018 ఫిబ్రవరిలో గార వద్ద ఎత్తిపోతల పథకం పనులకు అప్పటి ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి భూమి పూజ చేశారు. 2,200 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.2.75 కోట్ల అంచనాతో ఎత్తిపోతల పథకం పనులు చేపట్టారు. అప్పట్లోనే పంపు హౌస్, మోటార్లు, విద్యుత్ లైన్లు, పైపు లైన్లు వంశధార నదిలో బావి పనులు వేగవంతంగా జరిగాయి. సుమారు 75 శాతానికి పైగా పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకం పనులను నిర్లక్ష్యం చేయడంతో సాగునీటి కోసం రైతులు అవస్థలు పడాల్సి వచ్చింది. మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో రైతుల విజ్ఞప్తి మేరకు ఈ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యే గొండు శంకర్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. ఎత్తిపోతల పథకం పూర్తిచేసి ప్రస్తుత ఖరీఫ్‌లోనే శివారు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సంబంధిత అధికారులకు సూచించారు. దీంతో ఈ పనులు జోరందుకున్నాయి. దీనిపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి చేసుకున్న పంపు హౌస్

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు..

గార వద్ద నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేసి ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎమ్మెల్యే గొండు శంకర్ ఎప్పటికప్పుడు దీనిపై చర్చిస్తున్నారు. -కె.వి.వి.సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏ.పి.ఎస్.ఐ.డి.సి.

ఎంతో సంతోషంగా ఉంది..

ఎన్నో ఏళ్లుగా పూర్తిస్థాయిలో సాగునీరు అందక... పంటలు పండక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గొండు శంకర్ కృషితో ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కావచ్చాయి. ఈ ఖరీఫ్ పంటకు సాగు నీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండటంతో రైతులందరం సంతోషంగా ఉన్నాం.

-సూర్య, రైతు, కళింగపట్నం

కాంట్రాక్టర్లు రాక.. వేలం ఖరారు కాక

● మండల పరిషత్ సిబ్బంది ఆశీలు వసూలు

● ఇదీ నారాయణవలస పశువుల సంతలో పరిస్థితి



నారాయణవలస పశువుల సంత

కోటబొమ్మాళి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణ వలసలో గురువారం జరిగే పశువుల సంత ఆశీలు వసూళ్లకు మూడు సార్లు వేలం పాట పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. సిండికేట్ కావడం వల్ల టెండర్లు ఖరారుకావడంలేదన్న విమర్శలొస్తున్నాయి. వేలం ఖరారు కాకపోవడంతో ప్రభుత్వం ఆదాయనికి గండిపడుతోంది.

కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యారా..?

నారాయణవలస సంత జిల్లాలోనే పెద్ద పశువుల సంతగా గుర్తింపు పొందింది. గతంలో అధికారులు నిర్వహించే వేలం పాటకు 20 నుంచి 30 మంది వరకు కాంట్రాక్టర్లు ముందుకొచ్చేవారు. గతంలో పాట మరో నెలలో నిర్వహిస్తారంటే ముందుగానే పాటదారులు ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి లాబీయింగ్ చేయించేవారు. ప్రస్తుతం పాట మూడుసార్లు వాయిదా పడినా ఏ ఒక్కరూ కూడా పాటలో పాల్గొనడానికి ముందుకు రాకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేలంపాటకు హాజరుకాకపోతే అధికారులే తక్కువకు వేలం ఖరారుచేస్తారని భావించి కాంట్రాక్టర్లంతా సిండికేట్ అయ్యారన్న ఆరోపణలువినిపిస్తున్నాయి.

మూడు సార్లు..

2019లో సుమారుగా రూ.60 లక్షలకు వేలం ఖరారైన విషయం విదితమే. తర్వాత గతఏడాది పోటీ పెరగడంతో కాంట్రాక్టర్లు రూ. 80 లక్షలకు పైగా పాటపాడారు. అయితే ఈ సంవత్సరం మార్చి 31తో వేలంపాట గడువు ముగిసింది. దీంతో అధికారులు పాట నిర్వహించకుండా మళ్లీ మూడు నెలలు పొడిగిస్తూ పాత వారికే ఆశీలు వసూళ్లకు అనుమతులిచ్చారు. అయితే జూన్ 30తో ఆ గడువు కూడా పూర్తి కావడంతో అధికారులు ఈనెల పదో తేదీన వేలం పాట నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ఆ రోజు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు సాయంత్రం ఐదో గంటలవరకు కూర్చొన్నా ఒక్క పాటదారుడు కూడా హాజరుకాకపోవడం విశేషం. దీంతో మళ్లీ 14వ తేదీకి వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఆ రోజూ కూడా ఎవ్వరూ హాజరు కాకపోవడంతో మరోసారి ఈనెల 16వ తేదీని వాయిదా వేశారు. అయినప్పటికీ ఏ ఒక్కరూ కూడా పాటలో పాల్గొనడానికి రాలేదు. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆశీలు వసూలుచేస్తున్నారు. పాట ఖరారు కాకపోవడంతో జడ్పీ, మండల పరిషత్, నారాయణవలస పంచాయతీ ఆదాయానికి గండిపడుతోంది.

పాట దారులు హాజరు కాలేదు..



నారాయణవలస పశువుల సంతలో ఆశీలు వసూళ్లకు ఈనెలలోనే ఇప్పటి వరకు మూడు సార్లు పాట నిర్వహించాం. అయినా పాటకోసం ఎవ్వరు హాజరు కాలేదు. దీంతో మండల పరిషత్ సిబ్బందితో ఆశీలు వసూలు చేస్తున్నారు. మరోసారి వేలం పాట నిర్వహిస్తాం. అప్పటికీ పాటదారులు ఎవ్వరు రాకపోతే ఉన్నతాధికారులతో మాట్లాడి ఏమి చేయాలో నిర్ణయం తీసుకుంటాం. -కె.ఫణీంద్రకుమార్, ఎంపీడీవో, కోటబొమ్మాళి

కిడ్నీవ్యాధుల మూలాలు గుర్తించండి

● నెఫ్రాలజిస్ట్ రవిరాజ్ బృందంతో ఎమ్మెల్యే ఆసుపత్రి పరిశీలన

పలాస, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాలు గుర్తించి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు.గురువారం పలాసలోని కిడ్నీ ఆసుపత్రి, పరిశోధన కేంద్రాన్ని నెఫ్రాలజిస్ట్ రవిరాజ్‌తో కూడిన వైద్య బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారితో కలిసి శిరీష ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిరీష విలేకరులతో మాట్లాడుతూ వ్యాధిమూలాలపై ఇప్పటికే సర్వే జరుగుతోందని, మరో ఏడాది పాటు సర్వే నిర్వహించిన తర్వా వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. లోతైన పరిశీలన జరిపి మూలాలు కనుగొంటున్నారని, ఈ ప్రక్రియ పూర్తయితే వ్యాధి ప్రబల కుండా చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని చెప్పారు. ఎన్టీయార్ సుజల ద్వారా రూ.2 కే 20 లీటర్ల శుద్ధ జలాలు అందించామని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దాన్ని రూ.7కు పెంచి తరువాత పథకాన్నే నిలిపివేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఎన్టీయార్ జలశిరి పథకం ద్వారా సుద్ధ జలాలు ఉద్దానం గ్రామాలకు అందిస్తున్నామన్నారు. 2019కు ముందే ఉద్దానం గ్రామాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్థుల కోసం ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, హరిపురం, పలాసలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా సేవలందించామన్నారు. రూ.50 కోట్లతో కిడ్నీ ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఇది కార్యరూపం దాల్చుతున్న సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిందని, వెంటనే పనులుప్రారంభించాల్సిన ఆసుపత్రిని నాలుగేళ్ల తరువాత నిర్వహించారన్నారు. ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించలేదని, నామమాత్రంగా వైద్యాధికారులను నియమించారని, సిబ్బందిని వేసినా జీతాలు ఇవ్వలేని స్థితికి చేరారన్నారు. తాము అధికారం చేపట్టిన వెంటనే వైద్యాధికారులను నియమించడంతో పాటు సిబ్బందికి వేతనాలు చెల్లించామని, డయాలసిస్ యూనిట్లు కూడా వివిధ సంస్థల నుంచి సేకరించి అందించామన్నారు.



రోగులకు అందజేస్తున్న సేవలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శిరీష

గ్రామాల్లో వైద్యబృందం పర్యటన..

ఉద్దానం కిడ్నీ బాధిత గ్రామాల్లో డాక్టర్ రవిరాజ్‌తో కూడిన వైద్యబృందం పర్యటించింది. నేరుగా రోగుల ఇళ్లకు వెళ్లి మందులు వినియోగిస్తున్న తరువాత పరిస్థితి ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకుంది. గ్రామాల్లో తాగునీరు పూర్తిస్థాయిలో ఇస్తున్న తరువాత పరిస్థితి మారిందని, కొత్తగా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని బృంద సభ్యులు తెలిపారు. వ్యాధి సోకిన వారికి త్వరితగతిన నయం చేయడానికి అన్నిచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు తొలుత వైద్య బృందంతో ఎమ్మెల్యే శిరీష చర్చించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ, నార్త్ అమెరికా కిర్లిన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ రాయ్‌చౌదిరి, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, యవ్వారి మోహనరావు, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.



అనుమతులు లేని హాల్‌మార్క్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న బీఐఎస్ అధికారులు

బయటపడిన.. 'బంగారం' బండారం

(ఐదో పేజీ తరువాయి)

కూడా గుర్తించి.. బంగారం ఆభరణాల విక్రయాల్లో బండారాన్ని బయటపెట్టారు. వివరాల్లోకి వెళితే..

● నరసన్నపేటలోని మారుతీనగర్ జంక్షన్ వద్ద జీఎన్ఆర్ (గుడ్ల నాగరాజు) గోల్డ్ అండ్ డైమండ్ జ్యూయలరీ షాపులో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సంస్థ (విజయవాడ జోన్) జాయింట్ డైరెక్టర్ టి.అర్జున్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేశారు. షాపులో హాల్‌మార్కు లేకుండా 1072.450 గ్రాముల బంగారం ఆభరణాలు విక్రయానికి సిద్ధంగా ఉంచినట్టు గుర్తించారు. ప్రభుత్వం నుంచి జీఎన్ఆర్ బులియన్ అండ్ హోల్‌సేల్ పేరుతో అనుమతి తీసుకుని, మార్కెట్‌లో మాత్రం గోల్డ్ అండ్ డైమండ్ పేరుతో వ్యాపార బోర్డులను ఏర్పాటు చేయడంపై అధికారులు ఆరా తీశారు. షాపులో కొన్ని బంగారం ఆభరణాలపై డమ్మీ నెంబర్లు (ఇతర ఐడీ నెంబరు)తో ఉన్న హాల్‌మార్క్ ఉన్నట్లు గుర్తించారు. ఆ హాల్‌మార్క్ ముద్రించే కేంద్రం కోసం ఆరా తీశారు. నరసన్నపేట గాంధీబజారుకు సమీపంలో మేడ మీద అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ హస్య హాల్‌మార్క్ టెస్టింగ్ కేంద్రంలో ఈ అక్రమాలు జరుగుతున్నట్టు గుర్తించారు. ఇక్కడ నకిలీ హాల్‌మార్క్‌లను ముద్రిస్తున్నట్టు తెలుసుకున్నారు. పలు జ్యూయలరీ షాపుల్లో ముద్రించే ఐడీ నెంబర్లను ఈ కేంద్రంలో మళ్లీ ముద్రిస్తూ.. ప్రత్యేకంగా హాల్‌మార్క్ ముద్రలు వేసినట్లు గుర్తించారు.

● నాణ్యత గల బంగారు ఆభరణాలకు.. కేంద్ర ప్రభుత్వం హెచ్‌యూఐడీ నెంబరు జారీ చేసి షాపు పేరుతో హాల్‌మార్కు ఇస్తుంది. వీటిని జ్యూయలరీ షాపుల యాజమానులు తాము విక్రయించే ఆభరణాలపై ముద్రించాలి. కానీ జీఎన్ఆర్ షాపులో ఎటువంటి హాల్‌మార్కు లేకుండా ఉన్న ఆభరణాలను గుర్తించి సీజ్ చేశామని బీఐఎస్ జేడీ అర్జున్ తెలిపారు. 'నరసన్నపేట మెయిన్‌రోడ్డులో ఈ షాపు నిర్వహణకు బీఐఎస్ నుంచి ఎటువంటి అనుమతులు లేనట్టు గుర్తించాం. జోగిపేటలో బంగారం షాపు నిర్వహిస్తున్నట్లు అనుమతి తీసుకుని ప్రాంతాన్ని మార్చడంపై కూడా శాఖపరంగా చర్యలు తీసుకుంటాం. షాపు యజ మానికి ఆభరణాల సీజింగ్ నోటీసు అందజేశామ'ని ఆయన తెలిపారు. హాల్‌మార్క్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. దాడుల్లో బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ వివేకవర్ధన్‌రెడ్డి, నరసన్నపేట పోలీసులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్‌కు క్రేజ్

(ఐదో పేజీ తరువాయి)

శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), ఆదిత్య ఇనిసిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంటు (టెక్కలి), జీఎంఆర్ ఐటీ (రాజాం) ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. అంబేడ్కర్ యూనివర్సిటీలో 180 సీట్లు, నాలుగు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో కలిపి 3,690 సీట్లు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో కలిపి 3,870 సీట్లు భర్తీకానున్నాయి. ఏపీ ఈఏపీ సెట్ రాసి వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికకు ఆప్షన్ల నమోదు ప్రక్రియ శుక్రవారంతో ముగియనుంది. ఆప్షన్ల నమోదులో మార్పులు, చేర్పులకు శనివారం అవకాశం ఉంది. 22న సీట్ల కేటాయింపు వివరాలను సెట్ కన్వీనర్ ప్రకటిస్తారు. ఈ ఏడాది ఇంజనీరింగ్ అడ్మిషన్లు బాగానే ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈసీఈ, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో కూడా అడ్మిషన్లు కొంత మేరకు మెరుగుపడొచ్చు. మేనేజ్‌మెంటు కోటాలో సీట్లు కూడా నిండే అవకాశం ఉంది.

దాడులు.. హత్యలు!

(ఐదో పేజీ తరువాయి)

సంస్కరణలు చేపట్టినా.. రౌడీషీటర్ల విషయంలో పోలీసుశాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతీవారం రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిచి కౌన్సె లింగ్ నిర్వహించాలని ఎస్పీ ఆదేశాలిచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడం లేదు. జిల్లాలో పెరుగుతున్న నేరాల దృష్ట్యా రౌడీషీటర్ల విషయంలో ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోలీస్ శాఖ ప్రయత్నిస్తే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

పటిష్ఠ చర్యలు..

జిల్లాలో నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నాం. ఈ విషయంలో ప్రజల నుంచి కూడా సహకారం అవసరం. రౌడీషీటర్లపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తాం. లేనిపోని వర్గ విభేదాల తో చాలామంది విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకుంటున్నారు. ఈ విషయంలో మాత్రం వారిలో మార్పు రావాలి.

-సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

లోగయి.. నీరేదీ?

(ఐదో పేజీ తరువాయి)

ఆనకట్ట మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు. ఎమ్మెల్యే శిరీష చొరవచూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులకు తీవ్ర ఇబ్బందులు..



షట్టర్లు విరిగిపోయి నీరు ప్రవహించక నీరు వృథాగా పోతోంది. ఆయా మదుములు, తూముల వద్ద ఇసుక బస్తాలు నింపి అడ్డగా వేస్తున్నాం. నీటి ప్రవాహం ఎక్కువైతే ఆనకట్టలో దిగేందుకు సాహసం చేయాల్సిందే. రైతులు తీవ్ర ఇబ్బందులు నడుమ సాగు చేస్తున్నారు.

-బి.వల్లభరావు, ఆయకట్టు రైతు, గోవిందపురం

షట్టర్లు మార్చాలి..



ప్రభుత్వం తక్షణమే స్పందించి లోగయి ఆనకట్టు మదుములకు పూర్తిస్థాయిలో కొత్త షట్టర్లు ఏర్పాటు చేయాలి. మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులను ఆదుకోవాలి.

-బాడ జగన్నాయకులు, మాజీ సర్పంచ్, ఆయకట్టు రైతు

నిధులు మంజూరైతే..



లోగయి సాగునీటివనరును ఇప్పటికే పరిశీలించాం. అంచనాలు తయారుచేసి అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. రూ. కోట్లలో నిధులు అవసరం కావడంతో ఎమ్మెల్యే శిరీష దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి రైతులకు ఇబ్బం దులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసరావు, ఏఈఈ, జలవనరుల శాఖ, మందస



నీరు విడుదలచేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

నారాయణపురం కుడి కాలువకు నీటి విడుదల

● ప్రతి ఎకరాకూ నీరందిస్తాం: ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు

ఎచ్చెర్ల/సంతకవిటి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల, పొందూరు, సంతకవిటి మండలాలకు నారాయణపురం ఆనకట్ట వద్ద కుడి కాలువ ద్వారా సాగునీటిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన పూజలు నిర్వహించారు. కొన్నేళ్లుగా ఈ కాలువ పనులు చేపట్టక పోవడంతో సాగునీటి సరఫరా కష్టమైందని ఎమ్మెల్యే అన్నారు. రైతుల ఇబ్బందులను గమనించి కాలువ పనులు చేసి నీరు విడుదల చేశామన్నారు. నారాయణపురం ఆనకట్ట కుడి, ఎడమ కాలువలు ద్వారా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 37,500 ఎకరాలకు నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రూ.3 కోట్లతో కుడి, ఎడమ కాలువలు, ఉపకాలువల పూడికతీత, మరమ్మతులు చేపట్టినట్టు తెలిపారు.

● జలవనరులశాఖ ఎస్ఈ పి.సుధాకర్ మాట్లాడుతూ జైకా పనులు నిలిచి పోయాయని, ఆయకట్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ కోసం మళ్లీ రూ.177 కోట్లతో ప్రతిపాదన తయారు చేస్తున్నామని తెలిపారు.

● నారాయపురం ప్రాజెక్ట్ కమిటి చైర్మెన్ సనపల ఢిల్లీశ్వరరావు మాట్లాడుతూ రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడటమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

● కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఈ పి.సుధాకరరావు, డీఈఈ రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సనపల ఢిల్లీశ్వరరావు, పంచిరెడ్డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో కె.సాయి ప్రత్యూష

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

● శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష హెచ్చరించారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రసూతి ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ నేరంపై హోర్డింగులు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ పైడి స్వర్ణలత, డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరీన్, మాస్ మీడియా అధికారి ఎం.వేంకటేశ్వరరావు, సీపీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అబుదాబిలో గొర్లెవానిపేట వాసి మృతి

● గ్రామంలో విషాదఛాయలు



నీలాపు రాజు (ఫైల్)

గార రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వమరవల్లి పంచాయతీ గొర్లెవానిపేట గ్రామానికి చెందిన నీలాపు రాజు (50) అబుదాబిలో రెండు రోజుల క్రితం మృతి చెందినట్లు బంధువులు, కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... రాజు ఆరేళ్లుగా అబుదాబిలోని ఓ సంస్థలో తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. రెండు రోజుల కిందట మృతి చెందినట్టు అక్కడి వారు ఫోన్‌లో తమకు సమాచారం అందించినట్టు వారు తెలిపారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని... ఆయన మృతిపై అనుమానాలు ఉన్నాయని అంటున్నారు. మృతుడికి భార్య రమణమ్మ, ఇంటర్ పూర్తి చేసిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత ఏడాది దసరా ఉత్సవాలకు రాజు ఇక్కడికి వచ్చి వెళ్లాడని.. తమతో పాటు స్థానికులతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండే వాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఇంతలోనే మృతిచెందాడని తెలుసుకున్న బంధువులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

ప్రజల రుణం తీర్చుకుంటున్నాం: విప్ అశోక్


జాడుపూడిలో కరపత్రాలను అందిస్తున్న విప్ అశోక్


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కంచిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి అఖండ విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజల రుణాన్ని తీర్చుకుంటున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. జాడుపూడిలో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిలక చినబాబు రెడ్డి, మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య, పైల రామారావు, పైల పురుషోత్తం రెడ్డి, మురపాల ధర్మాయాదవ్, మోహన్‌రావు, కె.కురయ్య పాల్గొన్నారు.

సేవలలో ముందుంటా

గార రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేయడం ద్వారా వారి రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం ఉదయం వత్సవలస పంచాయతీలో నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజలు తన దృష్టికి సమస్యలను తీసుకు వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

హామీలన్నిటినీ నెరవేరుస్తాం

రణస్థలం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని గురువారం రాత్రి పతివాడపాలెం గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి బాటలో ఏపీ పరుగులు తీస్తోందని అన్నారు. ఏడాదిలో చేపట్టిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లంక శ్యామలరావు, పిషిని జగన్నాథంనాయుడు, అప్పడదొర, లంక ప్రభ, కోటి తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీ కలిశెట్టి

3న జిల్లా స్థాయి యోగా పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 17(ఆంధ్రజ్యోతి): నేషనల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 3న జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు ఎన్‌వైఎస్‌ఎఫ్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలోగల ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు కొంక్యాన మురళీధర్, కార్యదర్శి తంగి స్వాతి, కోశాధికారి చౌదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న పాలనలో మహిళలకు ప్రాధాన్యం

ఆమదాలవలస, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి ప్రమీల అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో కృష్ణాపురం పీఏసీఎస్ అధ్యక్షురాలు శిమ్మ మాధవి ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, బోర గోవిందరావు, తమ్మినేని చంద్రశేఖర్, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పేడాడ సూరపునాయుడు, జనసేన ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు మెట్ట సుజాత పాల్గొన్నారు.

బియ్యం తరుగు వస్తే ఉపేక్షించేది లేదు


బియ్యం తూకాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

జి.సిగడాం, జూలై 17 (ఆంధ్ర జ్యోతి): పౌర సరఫరాల గిడ్డంగుల నుంచి బియ్యం తరుగుదల వస్తే ఉపేక్షించేది లేదని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష హెచ్చరించారు. గురువారం స్థానిక పౌర సరఫరాల గిడ్డంగిని ఆమె తనిఖీ చేశారు. బియ్యం నిల్వలను, తూకం తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రేషన్ డీలర్లకు బియ్యంలో తరుగుదల లేకుండా అందించాలన్నారు. మెట్టవలస కూడలి వద్ద దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయించేందుకు అనుమతుల కోసం దరఖాస్తు చేయడంతో అక్కడి స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం.సరిత, ఆర్ఐ ఆబోతుల రాధ, వీఆర్వో సీతయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం, జూలై17(ఆంధ్రజ్యోతి): స్థానిక జేసీఐ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు కాళ్ల జయదేవ్ సమక్షంలో 120 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెచ్చా వాసవి, సంతోష్‌సాహూ, తంగుడు షణ్ముఖరావు, శిరీష, శ్రావ్య, రేణుక పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో 5వేల మందికి సేవలు

పొందూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పొందూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలో 10 వేలమంది రైతులు సభ్యులుగా ఉన్నారని.. వారిలో 5వేల మందికి వ్యవసాయ, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేస్తున్నామని అధ్యక్షులు వండాన మురళి, డైరెక్టర్లు కె.వెంకటరమణ, దుంపల సత్యం, సీఈవో పాపినాయుడు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు అన్నెపు రాము, బలగ శంకర భాస్కర్, పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ఆమదాలవలస, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీడీపీవో కార్యాలయం వద్ద ఈ నెల 21న జరగనున్న అంగన్వాడీ కార్యకర్తల ధర్నాకు సంబంధించి గురువారం సమ్మె నోటీసును అందించారు. సీడీపీవో నాగమణి అందుబాటులో లేకపోవడంతో జూనియర్ అసిస్టెంట్ అమర్నాథ్‌కు నోటీసును అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, సునీత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉంటా

బూర్జ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. గురువారం బూర్జ సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్ శ్రీరామ్మూర్తినాయుడు, సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మణరావు ప్రమాణ స్వీకార మహోత్సవంలో రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విశ్వ ప్రసాద్, సీఈవో జగన్‌తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

సోంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు స్థానిక బాలసదన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, నిద్రించే ప్రదేశాలు, చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

సోంపేట రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సోంపేట మండలంలోని ఎకువూరు మత్స్యకార గ్రామం నుంచి గొల్లవూరు, తురక శాసనాం మీదుగా పాత్రపురం పాత జాతీయ రహదారి వరకు రూ.1.80 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రోడ్డు పనులు ఎట్టకేలకు గురువారం ప్రారంభమయ్యాయి. శాసనాం, గొల్లవూరు పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులను జేఈ ధనుంజయ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు


ఆమదాలవలసలో తనిఖీ చేస్తున్న అధికారులు


రణస్థలంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఆమదాలవలస, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల షాపులపై వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని హోల్‌సేల్ ఫెర్టిలైజర్స్ డీలర్స్ వైశ్యరాజు శ్రీరామరాజు అండ్ కో కేసీఆర్ గొడౌన్స్‌లో విస్తృతంగా తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం శ్రీరామరాజు అండ్ కోకు సంబంధించి శ్రీదేవి టాకీస్ వద్ద ఉన్న ఎరువుల గొడౌన్‌ను తనిఖీ చేసి..రికార్డులను పరిశీలించారు. అనంతరం బి.ఆర్.నగర్ వద్దనున్న కేసీఆర్ గొడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ కూడా ఎటువంటి తేడాలు లేవని గుర్తించారు. దాడులు నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పలువురు ఎరువుల వ్యాపారులు దుకాణాలను మూసివేసి వెళ్లిపోయారు. ఈ దాడుల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయ ప్రసాద్, విజిలెన్స్ సీఐ అడారి సంతోష్‌కుమార్, వ్యవసాయాధికారులు మెట్ట మోహన్ రావు, సురేష్, ఏఈవో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సులు పక్కాగా ఉండాలి

రణస్థలం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎరువులు విక్రయించే షాపులకు పక్కాగా లైసెన్స్‌లు ఉండాలని వ్యవసాయ శాఖ అధికారి విజయప్రసాద్, విజిలెన్స్ సీఐ ఎ. సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం కోష్టలోని శ్రీ శ్రీనివాస ఎంటర్ ప్రైజెస్ ఎరువుల షాపులో తనిఖీలు చేపట్టారు. రికార్డులలో పొందు పరచని 126 మెట్రిక్ టన్నుల ఎరువులను గోదాంలో నిల్వ ఉంచినట్లు గుర్తించామని తెలిపారు. వీటి విలువ రూ.20.46 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ ఎరువులు విక్రయించకూడదని నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ అధికారులు విజయభాస్కర్, సురేష్‌లు పాల్గొన్నారు.

యూరియా తరలింపుపై రైతుల ఆందోళన

పొందూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బాణాం సచివాలయ పరిధిలో యూరియాను తరలిస్తున్నారంటూ స్థానిక రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. బాణాం గ్రామానికి 430 యూరియా బస్తాలను అధికారులు కేటాయించారు. ఈ యూరియాను గ్రామానికి తెస్తున్న వాహనాన్ని నిలిపి మూడుమర్రిచెట్ల వద్ద 80 బస్తాలను దించేశారు. రైతులకు ఈ సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. గ్రామానికి వచ్చిన యూరియా బస్తాలను ఇక్కడ ఎందుకు దించారంటూ ఏఈవో వెంకటేష్‌ను నిలదీశారు. పీఏసీఎస్ డైరెక్టర్, మాజీ సర్పంచ్ రమణ, మాజీ సర్పంచ్ పి.రవిబాబు గ్రామానికి వచ్చిన యూరియా ఎలా తరలిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవేటు వ్యాపారులకు అధిక ధరలకు అమ్మేందుకే తరలిస్తున్నారంటూ రైతులు ఆరోపించారు. వారు ఆందోళనకు దిగడంతో యూరియాను బాణాం సచివాలయానికి తరలించారు.

న్యూస్‌బాక్స్

నీలమ్మతల్లికి స్వర్ణకిరీట ధారణ


నీలమ్మతల్లి

శ్రీకాకుళం కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బరాటం వారి వీధిలో ఉన్న నీలమ్మ తల్లి ఆలయంలో ఆవేటి పండుగ సందర్భంగా అమ్మవారు స్వర్ణకిరీటంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెంటా కిరణ్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు బరాటం సాయిరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన వస్త్రాలు, పూలతో అలంకరించారు.

ఈవోపీఆర్‌డీగా వీరభద్రస్వామి

కంచిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కంచిలి మండల పరిషత్‌కు నూతన ఈవోపీఆర్‌డీగా గుజ్జల వీరభద్రస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కవిటి మేజర్ పంచాయితీ ఈవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కంచిలి ఈవోపీఆర్‌డిగా నియమితులయ్యారు. విధుల్లో చేరిన వీరభద్రస్వామిని ఎంపీడీవో వి.తిరుమలరావు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

రేపు ప్రజావేదిక

లావేరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈనెల 19న ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.వెంకటరాజు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సుమారు రూ.30 కోట్ల పనులకు సంబంధించి ఇటీవల గ్రామాల్లో తనిఖీలు చేపట్టారని తెలిపారు. దీనిపై ఈ సభలో చర్చించనున్నట్టు ఆయన తెలిపారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు

అరసవల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు స్మార్ట్ మీటర్లు వద్దని, ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, తాండ్ర ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో విద్యుత్తు భారాలకు వ్యతిరేకంగా గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను బద్దలు గొట్టండి అని నారా లోకేష్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం మోసం కాదా అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజలను దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని విమర్శించారు. ఈ నెల 22 వరకు మండల కేంద్రాలలో సదస్సులను విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

కంచిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బూరగాంలో విద్యుత్ సరఫరా సరిగా లేక రాత్రివేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు తెలిపారు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పంచాయితీ పరిధిలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, గొల్లవీధుల్లో విద్యుత్ తీగలు తెగిపోయి సరఫరా లేక గత రెండురోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు సోంపేట ఏడిఈ ఎస్.రవికుమార్‌కు గురువారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ గురువయ్య, టీడీపీ నాయకులు బొడ్డు అప్పారావు, మద్దిల ప్రేమ్‌కుమార్, ఎం.మన్మథరావు, కొక్కిలి రాజు, బూతాడ శ్రీకాంత్, పిలక ఢిల్లీరావు పాల్గొన్నారు.

పెచ్చులూడిన ఆసుపత్రి పైకప్పు


పెచ్చులను పరిశీలిస్తున్న సిబ్బంది

పొందూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో గురువారం భవనం శ్లాబ్ పైకప్పు పెచ్చులూడి పడడంతో రోగులు భయంతో పరుగులు తీశారు. ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబు పగుళ్లు ఇవ్వడంతో ఆసుపత్రికి వచ్చే రోగులతో పాటు సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పెచ్చులు ఊడి పడడంతో భీతిల్లారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎటువంటి నష్టం కలుగలేదు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె


ఇచ్ఛాపురంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇచ్ఛాపురం, జూలై17 (ఆంధ్ర జ్యోతి): తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు రమేష్ పట్నాయక్ తెలిపారు. సమ్మెలో భాగంగా గురువారం మస్టర్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా జనరల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, డి.ఢిల్లీ, గంగాధర్ రథో, మంగళసత్తు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో...

శ్రీకాకుళం అర్బన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు అరుగుల గణేష్ డిమాండ్ చేశారు. గురువారం నగర పాలక కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో...

ఆమదాలవలస, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం లక్ష్మీనగర్‌వీధి జంక్షన్ నుంచి వన్ వే జంక్షన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడి సంతోష్, నీలాపు రాజేష్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పొందూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీలలో పారిశుధ్య పనులను గురువారం కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సర్వే బృందం పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు అందిస్తున్న నిధులను ఏవిధంగా వినియోగిస్తున్నదీ ఈ బృందం ఆరా తీసింది. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యురాలు, రీసెర్చ్ అసిస్టెంట్ ఎ.పుణ్యశ్రీ, సంతోష్‌కుమార్, డీపీఈఆర్‌సీ సత్యనారాయణ, ఈవో మోహన్‌బాబు, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

సంతబొమ్మాళి,జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెయ్యిపేట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఉదయపురానికి చెందిన భార్యాభర్తలు వంకల సంజీవ్, సరస్వతిలు ద్విచక్రవాహనంపై టెక్కలి వెళ్తున్నారు.రెయ్యిపేట వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడడంతో గాయాలయ్యాయి.సంజీవ్‌కు టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చికిత్సచేసి అనంతరం శ్రీకాకుళం తరలించారు.

కొట్లాటపై పోలీసులకు ఫిర్యాదు

శ్రీకాకుళం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలంలోని సింగుపురంలో ఆస్తివివాదం ఉద్రిక్తతకు దారితీసింది. అన్నదమ్ములు ఉంకిలి గణేష్, ఉంకిలి అప్పారావు మధ్యతలెత్తిన పొలం తగాదా, పరస్పర దాడులకు దారితీసింది. రూరల్ ఎస్.ఐ. కె.రాము కథనం మేరకు.. గురువారం ఉదయం తమనివాసంవద్ద గణేష్, తనతమ్ముడు అప్పారావుకి భూమిని ఎందుకు దున్నావు అని నిలదీయడంతో వివాదం తలెత్తింది. ఇది కొట్లాటకు దారితీసింది. దీనిపై గణేష్, అప్పారావు పరస్పరం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.

అట్రాసిటీ కేసుల కొట్టివేత

సంతబొమ్మాళి, జూలై17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయంలో ఎనిమిది మంది టీడీపీ మండలనాయకులపై పెట్టిన అట్రాసిటీ కేసులను శ్రీకాకుళం అట్రాసిటీకోర్టు గురువారం కొట్టివేసిందని ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. 2023 ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులపై అట్రాసిటీ కేసులు నమోదుచేశారు.

ముగ్గురు వైసీపీ నాయకులకు రిమాండ్

పలాస, జూలై 17(ఆంధ్రజ్యోతి): చిన్నబడాం గ్రామ రోడ్డులో ఈనెల 15వతేదీ రాత్రి గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా టీడీపీ కార్యకర్తలు అవినాష్, సంతోష్‌పై దాడిచేసి గాయపరచడంతో వైసీపీ నాయకులు డి.రమణారావు, సుందరరావు, సుబ్బారావును కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు వారిని గురువారం పలాస కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్‌విధించినట్లు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. కాగా ఈ కేసునకు సంబంధించి అప్పలరాజు వైసీపీ నాయకులకు న్యాయంచేయాలని కోరుతూ తమ న్యాయవాదితో కోర్టుకు వచ్చారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

సోంపేట/ఇచ్ఛాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పట్టుకొని విచారించగా 22.556 కిలోల గంజాయి తరలిస్తున్నట్లు తేలిందని ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. ఈమేరకు ఒడిశాలోని మోహన బ్లాక్‌కి చెందిన తలుషా నాయక్, సామ్సన్ బీరోలను అరెస్టు చేశామన్నారు. ఒడిశాకు చెందిన జితున్ ద్వారా ముంబయికి తరలిస్తున్నట్టు తెలిసిందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుజాత, సిబ్బంది శ్రీనివాస్, విజయ్, ఆనంద్ పాల్గొన్నారు.

నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు

ఇచ్ఛాపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి):మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా పట్టణఎస్ఐ ముకుందరావు ఆధ్వర్యంలో నార్కోటిక్‌డాగ్ సాయంతో రైల్వేస్టేషన్,పట్టణంలోని వివిధ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. వాణిజ్య సముదాయాలు, ప్రధాన షాపుల్లో తనిఖీచేశారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు తనిఖీలు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

సచివాలయ ఉద్యోగి అదృశ్యం

ఆమదాలవలస, జూలై 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని రామచంద్రాపురం గ్రామ సచివాలయంలో వైద్యవిభాగంలో విధులు నిర్వర్తిస్తున్న రావులవలస సుకన్య అదృశ్యం కావడంపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వరదావారి క్వార్టర్స్‌లో సుకన్య నివాసముంటోంది. బుధవారం ఉదయం గ్రామ సచివాలయంలో విధులకు వెళ్లింది.గురువారంఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో సుకన్య తల్లి పార్వతీ ఆమదాలవలస పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేశారు.

పల్లిసారధి జేఎల్‌ఎం మృతి

వజ్రపుకొత్తూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిసారధి జూనియర్‌లైన్‌మెన్(జేఎల్‌ఎం)మనిగాం జయకృష్ణ(29)గురువారం మృతిచెందారు. కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. దీంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందినట్లు తెలిపారు.

బంగారు కుటుంబాలకు మార్గదర్శకులను గుర్తించండి

నందిగాం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న బంగారు కుటుంబాలకు మార్గదర్శకులను గుర్తించాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో ఐవీ రమణ సూచించారు. శుక్రవారం నందిగాం ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీవో కుమార్ పట్నాయక్, ఉప ఎంపీడీవో రాజారావు, వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ, ఏపీవో ఎం.నాగరాజు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పీ-4 సర్వే మ్యాపింగ్‌పై అవగాహన

మెళియాపుట్టి, జూలై17(ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ బి.పాపారావు కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పీ-4 సర్వే మ్యాపింగ్ పై వీఆర్వోలకు అవగాహనకల్పించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ బంగారు కుటుంబాలతోపాటు మార్గదర్శులను ఎంపికచేయాలని తెలిపారు. పేదలను గుర్తించి వారికి ముందుకు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దానికి అనుగుణంగా పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్‌పండా తదితరులు పాల్గొన్నారు.

బాలియాత్రను అధికారికంగా నిర్వహించాలి

జలుమూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బాలియాత్రను ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని కమిటీ సభ్యులు కోరారు. గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంస్కృతిక, సంప్రదాయాలను ఇనుమడింపజేసే బాలియాత్ర ఏటా శ్రీముఖలింగంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలియాత్ర కమిటీ ప్రతినిధి దువ్వాడ జీవితేశ్వరరావు, బొడ్డేపల్లి నేతాజీ, శ్రీముఖలింగం సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ తర్ర బలరాం, అర్చకులు ఎస్.వెంకటాచలం, నాయుడుగారి జనార్దన, పంచాది నారాయణమూర్తి, శివ, సీపాన రాము, చింతాడ వెంకటరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జీడి వ్యాపారుల అభినందన

పలాస, జూలై 17(ఆంధ్రజ్యోతి): పలాస జీడిపప్పుకు ప్రతిష్ఠాత్మకమైన వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్ కార్యక్రమం కింద జాతీయస్థాయి అవార్డు లభించడంతో కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్‌కు పలాస పారిశ్రామికవాడ జీడి వ్యాపారుల, ఆలిండియా క్యాజూ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. పలాస జీడి పప్పుకు లభించిన అవార్డును ఇటీవల కలెక్టర్ ఢిల్లీలో అందుకున్న విషయం విదితమే.ఈనేపథ్యంలోగురువారం కలెక్టర్‌నుఏఐసీప సభ్యుడు మల్లా కాంతారావు, పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి కె.వినయ్, తాళాసు శ్రీను, సుడియా రత్నాకర్, కొంచాడ సందీప్ అభినందించారు. కాగా ఈనెల 24 నుంచి మూడురోజుల పాటు జరిగే ఆలిండియా క్యాషూ కన్వెన్షన్‌కు హాజరుకావాలని కలెక్టర్‌కు పారిశ్రామికవేత్తలు ఆహ్వానించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడికి ఆర్థిక సహాయం

జలుమూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెద్దదూగాం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు జి.షణ్ముఖరావుకు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, సభ్యులు ఆర్థికసాయం చేశారు. కొన్నాళ్లుగా షణ్ముఖరావు అనారోగ్యంతో బాధపడుతుండడం 40 వేలు అందజేశారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కరవంజ కూర్మారావు పాల్గొన్నారు.



మూతపడిన రేగులపాడు ప్రాథమిక పాఠశాల

వసతులు ఉన్నా.. విద్యార్థులు లేక

● రేగులపాడు, వీఆర్‌సీపురం ప్రాథమిక పాఠశాలల మూత

పలాసరూరల్, జూలై17(ఆంధ్రజ్యోతి):మండలంలో రెండుప్రాథమిక పాఠశాలలు 2025-26 విద్యాసంవత్సరంప్రారంభంలో విద్యార్థులు లేకపోవడంతో మూతపడ్డాయి.పాఠశాలల్లో అన్నిరకాల వసతులు ఉన్నా మూతపడడంపై ఆందోళననెలకొంది. రేగులపాడు పాఠశాలలో గతఏడాది నలుగురు విద్యార్థులు ఉండగా, వారంతా టెక్కలిపట్నంలో ఆరో తరగతి పాఠశాలలో చేరారు. ఒకరు మాత్రం కొన్నిరోజులు వచ్చినా ఎవరులేకపోవడంతో ఆ విద్యార్థి కూడా టెక్కలిపట్నం పాఠశాలలో చేరడంతో పాఠశాల మూతపడాల్సిన దుస్థితి ఏర్పడింది.అదేవిధంగా వీఆర్‌సీపురంప్రాథమిక పాఠశాలలో నాలుగోతరగతికిచెందిన ఇద్దరు విద్యార్థులు అభ్యసించేవారు.వారు కూడా పెదంచల పాఠశాలకు వెళ్లిపోవడంతో పాఠశాలను మూసివేశారు.ఆ గ్రామంలో బడిఈడు పిల్లలు లేకపోవడం తదితర కారణాల వల్ల మూతపడింది. ప్రధానంగా రాష్ట్రప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం తల్లికి వందనంతోపాటు రాధాకృష్ణవిద్యాకిట్ పేరుతో బ్యాగులు,బూట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, ఆరోగ్యతనిఖీల వంటి కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వ పాఠశాలలు మూతపడడం విశేషం.

రైతుల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతుశిరీష తెలిపారు. రైతులు అభిమానం చూరగొనేలా నూతన పాలకవర్గ సభ్యులు పనిచేయాలని కోరారు.గురువారం వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా కణితి సురేష్‌చౌదరి, డైరెక్టర్లుగా రాపాక శాంతమూర్తి, కొత్తూరు అప్పారావుతో ప్రమాణస్వీకారం చేయించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులు పక్షపాతన్నారు. వైసీపీహయాంలో కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని 41 వేలఓట్లు మెజార్టీతో గెలిపించి అండగా నిలిచారన్నారు. మాజీ మంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎరువులు. విత్తనాలు అందిండంలో ముందుచూపుతో వ్యవహరించాలన్నారు. పని చేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండతిధ్యక్షుబు సూరాడ మోహనరావు, అగ్నికులక్షత్రియ కార్పోరేషన్ డైరక్టరు పుచ్చ ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, క్లస్టరు ఇన్‌చార్జులు దువ్వాడ హేంబాబుచౌదరి, అర్సవెళ్లి ఉమామహేశ్వరరావు, శశి, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి విఠల్, మాజీ ఎంపీపీ వసంతస్వామి, కణితి అప్పయ్య చౌదరి, రవి, నెయ్యిల సూర్యనారాయణ పాలొల్లన్నారు.

● హరిపురం, జూలై17 (ఆంధ్రజ్యోతి): మందస, బాలిగాం పీఏసీఎస్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారాన్ని నిర్వహించారు.మందస పీఏసీఎస్ ఛైర్మన్‌గా తమిరి భాస్కరరావు, డైరక్టర్లుగా పిన్నింటి వాసు, కద్రక హరికృష్ణ, బాలిగాం ఛైర్మన్‌గా ఎల్.రుద్రయ్య, డైరక్టర్లుగా గున్న రామారావు, సప్ప జీవనరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాజీ మంత్రి గౌతు శివాజీ, ఎమ్మెల్యే గౌతు శిరీషలను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, కొర్ల కన్నారావు, వజ్జ బాబూరావు, దాసరి తాతారావు, లింగరాజు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు:పీఏసీఎస్ ఛైర్మన్‌గా బాధ్యత స్వీకరిస్తున్న కణితి సురేష్‌చౌదరికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గౌతుశిరీష, గౌతుశివాజీ

పార్టీకి సేవచేసిన వారికి ప్రోత్సాహం: ఎంజీఆర్

పాతపట్నం, జూలై17 (ఆంధ్రజ్యోతి): పార్టీకి చేసిన సేవలను గుర్తిస్తూ కొత్తవారికి పదవులిచ్చి ప్రోత్సహిస్తుందనిపాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గురువారం స్థానిక పీఏసీఎస్‌కార్యాలయంలో పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడిగా బండి రవివర్మ, డైరెక్టర్లుగా కాళ్ల కృష్ణ, సిరిపురం గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. కార్య క్రమంలో డీసీసీబీ సీఈవో అధికారులు రైతుసంఘ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంజీఆర్

పోలాకి పీఏసీఎస్ ఛైర్మన్‌గా భాస్కరరావు


పాలకవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి

పోలాకి, జూలై 17(ఆంధ్రజ్యోతి): పోలాకి పీఏసీఎస్ ఛైర్మన్‌గా బైరి భాస్కరరావు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ నాయకుడు ఎంవీ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, సీఈవో రాంబాబు, డీసీసీబీ మేనేజర్ సీతారామస్వామి సమక్షంలో రికార్డులపై ఛైర్మన్‌గా భాస్కరరావుతో తొలి సంతకం చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జిరమణమ్మ, నరసన్నపేట, సారవకోట మండలాల టీడీపీ అధ్యక్షులు శిమ్మచంద్రశేఖర్, కత్తిరివెంకటరమణ, పీఏసీఎస్ జీఎం శిమ్మజగదీష్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతిగృహాల్లో సీజనల్ వ్యాధులపై విద్యార్థులు, వసతిగృహ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కె.కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.గాయత్రి కోరారు. గురువారం టెక్కలిలోని సమీకృత బాలికల వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వసతిగృహ పరిసరాలు, వంటగది, పారిశుధ్య పరిస్థితులు, క్లోరినేషన్, తాగునీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమెతో పాటు వసతిగృహ సంక్షేమాధికారి విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

కలుపు నివారణ పద్ధతులు పాటించాలి

కోటబొమ్మాళి. జూలై 17 (ఆంధ్రజ్యోతి): వరిసాగు చేస్తున్న రైతులు కలుపు నివారణ పద్ధతులు పాటించాలని ఏవో ఎస్.గోవిందరావు తెలిపారు. గురువారం అక్కయ్యవలసలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువులు పంపిణీచేశారు. కార్యక్రమంలో వీఏఏ పద్మజ పాల్గొన్నారు.

లంపీస్కిన్ వ్యాధి నివారణకు టీకాలు

కోటబొమ్మాళి, జూలై 17(ఆంధజ్యోతి):మండలంలోని రామయ్యపేట, బావాజీపేట, యరకయ్యపేటలో 319 పశువులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శాంతారావు, రాకేష్, సందీప్, హరి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణపై అభిప్రాయసేకరణ

పోలాకి, జూలై 17(ఆంధ్రజ్యోతి): పోలాకిలోని బహిరంగ ప్రదేశాలల్లో పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రత, స్వచ్ఛ సర్వేక్షణపై ప్రభుత్వ రీసెర్చ్‌ఇన్వెస్ట్ గ్రేటర్ సిబ్బంది గురువారం అభిప్రాయసేకరణ నిర్వహించారు. బృందం నాయకుడు భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పోలాకి ప్రాథమిక ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వోన్నతపాఠశాల, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండే స్థలాలను పరిశీలించారు. కార్య క్రమంలో ఎంఆర్‌సీ దండకృష్ణ, సచివాలయ కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచ్ మజ్జి రమణమ్మ, హెచ్‌ఎం లక్ష్మి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై శ్రద్ధ చూపడంలేదు

కొత్తూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో పాలకులు శ్రద్ధ చూపడంలేదని వైసీపీరాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. గురువారం కొత్తూరులో జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో చింతాడ సూర్యనారాయణ, ఎంపీపీ సవర సావిత్రి, జడ్పీటీసీ కామక భారతి, ఆనందరావు పాల్గొన్నారు.

చదువుతోపాటు ప్రణాళికలు అవసరం

టెక్కలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో చదువుతో పాటు ప్రణాళిక అవసరమని ఐతమ్ పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షుడు సమీర్ భవానీ బట్ల తెలిపారు. గురువారం స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతికరంగ అభివృద్ధిలో విద్యార్థులు కొత్త పుస్తకాలు అధ్యయనం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానం పొందాలన్నారు. సమీర్ భవానీని ఐతమ్ పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ యుగంధర్, కేవీఎల్ భవానీ పాల్గొన్నారు.

భావవ్యక్తీకరణకు ఎమోజీ చక్కని సాధనం

పాతపట్నం, జూలై17(ఆంధ్రజ్యోతి): భావ వ్యక్తీకరణ ఎమోజీ విధానం చక్కని సాధనమని హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు తెలిపారు. గురువారం పాతపట్నం ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు నల్ల తారకరామారావు ఆధ్వర్యంలో వరల్డ్ ఎమోజీడేను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

కోటబొమ్మాళిలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

కోటబొమ్మాళి, జూలై 17 (ఆంధ్రజ్యోతి):కోటబొమ్మాళిలోని ఒకటి, రెండు వార్డులో గురువారంసుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ సర్పంచ్ బోయిన శారదమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ఉండాలి

కొత్తూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు ఎదురుగా కనిపిస్తున్న సమయంలో మహిళలు భయపడకుండా ఎదురించి ధైర్యంగా ఉండాలని కొత్తూరు సీఐ సీహెచ్ ప్రసాద్ కోరారు. గురువారంమండలంలోని కుంటిబద్రలో మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. సదస్సులో ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా రవీంద్రప్రసాద్

పాతపట్నం,జూలై17(ఆంధ్రజ్యోతి): పాతపట్నం డిప్యూటీ ఎంపీడీవోగా వాన రవీంద్రప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఈవోపీఆర్డీగా పనిచేసిన ఎల్ .వెంకటరావు సంతబొమ్మాళి బదిలీపై వెళ్లారు. కాగా వాన రవీంద్రప్రసాద్ శ్రీకాకుళం జడ్పీ నుంచి పదోన్నతిపై పాతపట్నం వచ్చారు.

పరిహారం ఇవ్వనిదే ఖాళీ చేయం

●మూలపేటలో పోర్టు నిర్వాసితులు స్పష్టీకరణ


మూలపేటలో మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

సంతబొమ్మాళి, జూలై17 (ఆంధ్రజ్యోతి): తాము పోర్టుకి వ్యతిరేకం కాదని, అందరికన్నా ముందుగా భూములివ్వడానికి ముందుకు వచ్చామని మూలపేట గ్రామస్థులు స్పష్టంచేశారు. భూములివ్వని వారికి అధిక మొత్తం చెల్లించి తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. తమకు కూడా అంత మొత్తంలో భూములకు పరిహారం ఇవ్వనిదే గ్రామాన్ని ఖాళీ చేసే ప్రసక్తే లేదని అధికారులకు తేల్చిచెప్పారు. గురువారం మూలపేటలో పోర్టు నిర్వాసితుల సమస్యలను ఇంటింటికి వెళ్లి రెవెన్యూ అధికారులు అడిగి తెలుసుకున్నారు. పోర్టు నిర్మాణంలో భాగంగా మూలపేట గ్రామాన్ని అక్కడ నుంచి నౌపడకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. అయితే తమ సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకూ గ్రామం కదిలి వెళ్లే ప్రసక్తే లేదని గ్రామస్థులు తేల్చిచెప్పిన విషయం విదితమే. దీంతో ఇటీవల టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి గ్రామంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఆ సమయంలో పెద్దఎత్తున గ్రామస్థులు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో గ్రామంలో రెవెన్యూ అధికారులు ఇంటింటికి వచ్చి సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరిస్తారని ఆర్డీవో హామీఇచ్చారు.ఈ నేపథ్యంలో అధికారులు మూలపేటలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ హేమసుందరావు అధికారులు పాల్గొన్నారు.

లోపాలను బీఎల్వోలు సరిదిద్దాలి: ఆర్డీవో

టెక్కలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): బీఎల్వోలు క్షేత్రస్థాయిలో లోపాలను సరిదిద్దాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. గురువారం టెక్కలి సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పోలింగ్ బూతులకు సంబంధించి ఓటర్ల అంశాలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. కుటుంబసభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండాలని, కొత్త ఓటర్ల చేర్పులు, చనిపోయిన ఓట్లు తొలగింపులు, డబుల్ ఎంట్రీలు తొలగింపుపై వివరించారు. సమావేశంలో ఎలక్షన్ డీటీ వనిత పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

కాశీబుగ్గ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన సమ్మె కాలం ఒప్పందాలు అమలు చేయాలని పారిశుధ్య కార్మికులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. హామీ ఇచ్చి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ పర్కిరించలేదని పలాసలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట్, సీహెచ్ మురుగన్, రవి పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణపై పోరాడాలి

కాశీబుగ్గ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కార్గో ఎయిర్‌పోర్టుకు బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహన్‌రావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ ఉద్దానంలో గ్రీన్‌ఫీల్డ్ కార్గోఎయిర్‌పోర్టుపేరుతో బలవంతపు భూసేకరణకు పూనుకుంటున్నారని ఆరోపించారు. రైతుల అభిప్రాయం తెలుసుకోకుండా వారి భూములను సర్వే చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

నిర్వహణ లేక.. మురుగు నీరు చేరి

● టెక్కలిలోని జిల్లాపరిషత్ రోడ్డులో తప్పని అవస్థలు

టెక్కలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని జిల్లాపరిషత్ రోడ్డులో సంతోషిమాత ఆలయం సమీపంలో రోడ్డుపైకి మురుగునీరు చేరడంతో వాహన చోదకులు అవస్థలుపడుతున్నారు. కాలువలు సక్రమంగా నిర్వహించకపోవడంతో చెత్త, మురుగు పేరుకుపోతోంది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపైకి కాలువలోని మురుగునీరు చేరుతుండడంతో వాహనచోదకులు అవస్థలు గురవుతున్నారు. గురువారం కురిసిన వర్షానికి టెక్కలిలో పలు కాలువలు మురుగునీరు జిల్లాపరిషత్ రోడ్డులోకి చేరింది. తక్షణమే పంచాయతీ అధికారులు కాలువల్లో పూడికలు తొలగించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


టెక్కలిలో జడ్పీ రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీరు

నేడు మంత్రి పర్యటన

టెక్కలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో మంత్రి కింజరాపుఅచ్చెన్నాయుడు శుక్రవారం పర్యటించనున్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీ, శ్రీనివాస్‌నగర్‌లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేయడంతోపాటు శ్రీనివాస్‌నగర్‌లో జరిగే సుపరిపాలనతో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారని టీడీపీ మండలాధ్యక్షుడు బగాది శేషగిరిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఎస్‌జీటీల సమావేశం

టెక్కలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి ప్రభుత్వోన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఏపీఎస్‌జీటీ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ నాయకులు బమ్మిడి ఐగేశ్వరరావు, బొడ్డేపల్లి నేతాజీ తెలిపారు. ఈసందర్భంగా కార్యవర్గఎన్నిక, సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

హరిపురం, జూలై17 (ఆంధ్రజ్యోతి): హరిపురంలో శుక్రవారం మంజూరు కవితాసంకలనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు దుప్పల రవికుమార్ ఒకప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నల్లి ధర్మారావు, కింతలి కృష్ణమూర్తి, డాక్టర్ కుమార్ నాయిక్, మిజ్జ భాస్కరరావు, రాపాక ధనరాజు తదితరులు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్.ఎన్.పేట/హిరమండలం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):మండలంలో శుక్రవారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ నరసింహకుమార్ ఒకప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ పరిధిలోని హిరమండలం ఉప విద్యుత్ కేంద్రంలో కొత్తబ్రేకర్‌ను ఏర్పాటు చేస్తుండడంతో హిరమండలం, ఎల్.ఎన్ పేట మండలాల్లోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

●హరిపురం, జూలై17 (ఆంధ్రజ్యోతి): హరిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగునుందని డీఈఈ యజ్ఞేశ్వరరావు, ఏఈఈ యోగిలు ఒక ప్రకటనలో తెలిపారు. పలాస హెచ్‌టీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు మండల సమావేశం

కొత్తూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి) కొత్తూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్ సమావేశం మందిరంలో జరగనుందని ఎంపీడీవో వి.నీరజ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు సమాచారంతో రావాలని కోరారు.

29లోగా నవోదయకు దరఖాస్తు చేసుకోవాలి

నందిగాం, జూలై 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన ఐదోతరగతి విద్యార్థులు ఈనెల 29లోగా ఆన్‌లైన్‌లో జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని నందిగాం ఎంఈవో-1, 2లు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు తెలిపారు.గురువారంనందిగాం ఎమ్మార్సీ భవనం ఆవరణలో వెన్నెలవలస నవోదయలో ఆరోతరగతి ప్రవేశానికి సంబంధించిన గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13న పాతబ్లాక్ కేంద్రాల్లో జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులతో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు.

అశోక్‌ను కలిసిన ఎంజీఆర్

పాతపట్నం, జూలై17(ఆంధ్రజ్యోతి): పాతపట్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గోవా గవర్నర్‌గా నియమితులైన టీడీపీ నాయకుడు అశోక్‌గజపతిరాజును విజయనగరంలోని అశోక్‌బంగ్లాలో గురువారం కలిశారు.నిజాయితీగల వ్యక్తిని గవర్నర్‌గా నియామకానికి కృషిచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడులకు ధన్యవాదాలు తెలిపారు.

●టెక్కలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజును గురువారం టెక్కలి బీజేపీ నాయకులు విజయనగరంలో కలుసుకున్నారు.కార్యక్రమంలోబీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అట్టాడ రవిబాబ్జీ, నరేంద్రచక్రవర్తి, లక్ష్మీనారాయణ, లింగరాజు, రామ్‌జీ, రెడ్డి, అన్నెపు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వీల్‌చైర్లు పంపిణీ

హరిపురం, జూలై17 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని సొండిపూడికి చెందిన మదర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నలుగురు దివ్యాంగులకు గురుదేవా ట్రస్ట్ సహకారంతో గురువారం చంకకర్రలు, వీల్‌చైర్లు ట్రస్ట్ ప్రతినిధులు భాస్కరరావు, కర్రి దుర్యోధనలు అందజేశారు. కార్యక్రమంలో వి.అప్పారావు, కోటి, తదితరులు పాల్గొన్నారు.

నందిగాంలో వర్షం

నందిగాం, జూలై 17(ఆంధ్రజ్యోతి): నందిగాం తదితర గ్రామాల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండలతో వరి ఎదలు, నారుమళ్లు ఎండిపోయే పరిస్థితిలో వర్షం కురవడంతో రైతులకు ఊరట లభించింది.